ఎర్రగడ్డ రైతు బజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 25, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 15, క్యారెట్ 38, దొండ 21, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 24, చామగడ్డ 31, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

ఇంజినీరింగ్ బి కేటగిరి సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ బి కేటగిరి సీట్లను ఆన్‌లైన్ కౌన్సెలింగ్, మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ (టీఆర్‌ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు బోయ రమేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులను ఆదివారం కోరారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో బీటెక్, బీఈ, బీఫార్మసీ, ఫార్మడీ కోర్సుల్లో 30 శాతం సీట్లను నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీని వలన మెరిట్ గల పేద, మధ్య తరగతి విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంచవద్దని పాత పద్ధతిలోనే సీట్లను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మందులు అందిస్తున్న దృశ్యం

చిలకలగూడ: జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, అమన్‌వేదిక సంయుక్తాధ్వర్యంలో దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. సుమారు 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేసి మందులు అందించారు. భారత్ వికాస్ పరిషత్ నేతృత్వంలో హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి అవసరమైనవారికి ఐరెన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, చిలకలగూడ ఎస్‌ఐ జ్ఞానేశ్వర్, పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి, అమన్‌వేదిక ప్రతినిధి ఎల్లయ్య, రాజు, రామస్వామి, బీజేపీ నాయకుడు నరేశ్, కోఆర్డినేటర్లు నర్సింగరావు, విక్రమ్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఇంట్లో విషాదం



కంచ కట్టయ్య

లాలాపేట: ప్రముఖ రచయిత ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఇంట్లో విషాదం నెలకొన్నది. ఆయన సోదరుడు కంచ కట్టయ్య (76) అనారోగ్యంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఆదివారం తార్నాకలో ఉంటున్న కంచ ఐలయ్య నివాసానికి కట్టయ్య పార్థీవ దేహాన్ని తరలించారు. స్వస్థలం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం, పాపయ్యపేటలో సోమవారం కట్టయ్య అంత్యక్రియలు జరుగుతాయని ఐలయ్య పేర్కొన్నారు. దాదాపు 55 ఏళ్లుగా కంచ కట్టయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడ్డాడు. 46 ఏళ్లుగా తన సోదరుడు బాగోగులను కంచ ఐలయ్యే చూసుకుంటున్నాడు. కట్టయ్య మృతితో ఆయన సతీమణి కంచ భారతి, సోదరుడు కంచ ఐలయ్య, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగారు.

చీటింగ్ కేసులో యువకుడి రిమాండ్

ఫిలింనగర్: కేసులు పరిష్కరిస్తామని చెప్పి డబ్బు వసూలు చేస్తున్న యువకుడిని ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. హుమయూన్‌నగర్ సోఫియా మంజిల్‌లో ఉండే ఇర్ఫాన్ హుస్సేన్(21) బీబీఏ చదువుతున్నాడు. ఆరేళ్ల క్రితం మాసబ్‌ట్యాంక్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఉసామా హుస్సేన్‌తో కలిసి ఉండేవాడు. ఇద్దరూ కలిసి పోలీసు కేసులను పరిష్కరిస్తామని నమ్మించి పలువురి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే 5 రోజుల క్రితం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేంద్ర అనే యువకుడిని కేసు నుండి తప్పిస్తానని నమ్మించి రూ.10 వేలు ఇర్ఫాన్ హుస్సేన్ తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే తాను మోసపోయిన విషయం తెలుసుకుని బాధితుడు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు ఇర్ఫాన్ హుస్సేన్‌ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఉసామా హుస్సేన్‌తో పాటు శ్రీనివాస్ మరో యువకుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మాన్సూన్ టీంలు వచ్చేస్తున్నాయ్..!

- రేపోమాపో రంగంలోకి ఎమర్జెన్సీ బృందాలు
- డివిజన్‌కో బృందం ఏర్పాటు
- ఒక్కో టీమ్‌లో 6–10 మంది సభ్యులు
- 24 గంటలూ అందుబాటులోనే



వరదనీటిని తొలగిస్తున్న మాన్సూన్ ఎమర్జెన్సీ టీం (ఫైల్)

సనత్‌నగర్: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను వరద ముప్పు నుంచి రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో వరదలు ముంచెత్తిన పలు సందర్భాల్లో ఎదురైన చేదు అనుభవాలు మళ్లీ పునరావృత్తం కాకుండా ముందస్తుగా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను రంగంలోకి దింపుతున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రధానంగా అమీర్‌పేట, బేగంపేట నాలా పరీవాహక ప్రాంతాల్లో వరద ముంపు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. బేగంపేట ప్రధాన రహదారిలోని ఎయిర్‌కార్గో, నాలా పరీవాహక ప్రాంతాలైన మయూరిమార్గ్, అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, టీకోటి గార్డెన్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్లతో పాటు అమీర్‌పేట డివిజన్‌లో అంకమ్మబస్తీ, హరిజనబస్తీ, గంగుబాయిబస్తీ, బుద్ధనగర్, లీలానగర్ బస్తీలు వరద ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అదేవిధంగా బేగంపేట సర్కిల్ పరిధిలోని మెక్లేన్‌గూడ, నల్లగుట్ట, బాపుబాగ్ కాలనీ, లాలా టెంపుల్, సెయింట్ మేరీస్ రోడ్డు, రాణిగంజ్, కర్బలా మైదానం, ఎంజీ రోడ్డు గాంధీ విగ్రహం వద్ద తదితర ప్రాంతాల్లో ఎక్కువగా నీరు నిలుస్తూ రాకపోకలకు అంతరాయం కలగడం నిత్యకృత్యంగా మారింది. వర్షం పడుతున్న ప్రతిసారీ డివిజన్ల వారీగా కేటాయించిన ప్రత్యేక మాన్సూన్ బృందాలు రంగంలోకి దిగి ఎప్పటికప్పుడు వరదనీటిని తొలగిస్తారు. ఈసారి కూడా అందుబాటులోకి రానున్నాయి.

ఒక్కో బృందంలో 6 నుంచి 10 మంది..

సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, మోండా డివిజన్లకు 1 చొప్పున మాన్సూన్ బృందాలు రానున్నాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా రేపో ఎల్లుండో టీంలు ఫీల్డ్‌లోకి వెళ్లనున్నాయి. డివిజన్లలో వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను బట్టి బృందంలోని సభ్యుల సంఖ్యను కేటాయించనున్నారు. ఒక్కో బృందంలో 6 నుంచి 10 మంది చొప్పున నియమించనున్నారు. వీరికి ఓ వాహనంతో పాటు వరదనీరు తొలగించే పరికరాలు అందుబాటులో ఉంటాయి. 8 గంటల చొప్పున రోజుకు 3 షిఫ్టుల్లో 18 బృందాల ద్వారా సుమారు 100 మంది సిబ్బంది అత్యవసర విధులు నిర్వర్తించనున్నారు.

నిత్యం అప్రమత్తం..

వర్షం పడుతుందంటే అత్యవసర బృందాలు అప్రమత్తమవుతాయి. నీరు నిలిచే రహదారులు, బస్తీల్లోకి చేరుకుంటారు. నీరు నిల్వ ఉండకుండా చూడడం, మ్యాన్‌హోళ్లను ఎత్తి నీటి ప్రవాహాన్ని తగ్గించడంపై దృష్టి పెడతారు. మరోవైపు కూలిన చెట్లను, కొమ్మలను తొలగించడంతో పాటు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడతారు. వీటితో పాటు వర్షాలకు పాడైన రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టడం, రహదారులపైకి కొట్టుకువచ్చిన మట్టి, బురద, ఇసుక తొలగించడం, మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్‌లకు అడ్డుగా ఉన్న చెత్తాచెదారం, ఔట్‌లెట్ల వద్ద నీరు పొంగిపొర్లకుండా వ్యర్థాలను తొలగించడం చేస్తారు.

డివిజన్ల వారీగా బృంద పర్యవేక్షకుల నంబర్లు

డివిజన్	పేరు	ఫోన్‌నంబర్
సనత్‌నగర్	మహ్మద్ జమీల్	8790624601
	అమీర్‌పేట డివిజన్లు	
బేగంపేట	ఎన్రిక్	9177129663
మోండా	చంద్రశేఖర్	9088872227
రాంగోపాల్‌పేట	శివప్రసాద్‌కుమార్	73375 57267
బన్సీలాల్‌పేట	చైతన్య	73864 87194

నిరంతర పర్యవేక్షణ..

వర్షాకాలంలో వరదనీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు మన్సూన్ టీమ్‌లు మరో 2 రోజుల్లో అందుబాటులోకి రావచ్చు. 24 గంటల పాటూ వారు సిద్ధంగా ఉంటాయి. వారిపై నిరంతర పర్యవేక్షణ చేపడుతాం. ముఖ్యంగా వాటర్ లాగింగ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి పెడతాం.

– ఖైరతాబాద్ సర్కిల్ డీఈ సాయిసందీప్

ఆస్ట్రేలియాలో ఎమ్మెల్యే తలసాని పర్యటన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఆదివారం సిడ్నీ నగరంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, యువనేత సాయికిరణ్ యాదవ్ పాల్గొన్నారు. తెలుగు వారిని ఇక్కడ కలుసుకోవడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బాధాకరం: ఎమ్మెల్యే

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోపీనాథ్ మరణవార్త తెలుసుకుని తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. 3 పర్యాయాలు ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

హెచ్‌ఎంఏ వార్షిక అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ భరత్ భూషణ్

అమీర్‌పేట: గ్రీన్‌పార్క్ మ్యారీ గోల్డ్ హోటల్‌లో హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్‌ఎంఏ) వార్షిక అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడి అపార ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, జాతి నిర్మాణాలకు సంబంధించి వ్యక్తులకు అవార్డులు అందజేశారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ కమాండర్ మాధవరావు హాజరై మాట్లాడుతూ.. దేశంలో క్షిపణుల తయారీలో పేరు కలిగిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ 'ఆత్మ నిర్బర్ భారత్' స్ఫూర్తిని ప్రదర్శిస్తోందన్నారు. బీడీఎల్ మన దేశ భద్రతను బలోపేతం చేయడమే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలోని దాదాపు 3200 ఎంఎస్‌ఎమ్‌ఈలకు ఊతమిచ్చి, స్వదేశీ సామర్థ్యాన్ని సృజనాత్మకతను పెంపొందించిందన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత వింగ్ కమాండర్ డాక్టర్ ఆవుల భరత్ భూషణ్‌కు జీవిత సాఫల్య అవార్డు అందజేశారు.1965–71 మధ్య కాలంలో జరిగిన భారత్-పాక్ యుద్ధాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే కేన్సర్ కేర్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డా.వాసుదేవ్ చతుర్వేది బెస్ట్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డు అందుకున్నారు.

కంటోన్మెంట్‌లో 'ఏక్ పేడ్ మా కే నామ్'



మొక్క నాటుతున్న నర్మద, నాయకులు

రసూల్‌పురా: 'ఏక్ పేడ్ మా కే నామ్'లో భాగంగా కంటోన్మెంట్ బోర్డు వర్క్‌షాపు వద్ద బీజేపీ నాయకులు ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మహంకాళి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో పాటు దేశ ప్రధానిగా మోదీ 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కంటోన్మెంట్ వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మాచర్ల శ్రీనివాస్, నీరజ్, కామిని, వార్డు అధ్యక్షుడు అరుణ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వివేక్‌కు మంత్రి పదవిపై సంబరాలు



వివేక్‌ను సన్మానిస్తున్న మాల మహానాడు నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని మంత్రిగా నియమించడంపై ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో ఆదివారం టపాకాయలు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. అలాగే మంత్రివర్గంలో మాదిగ సామాజికవర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్థానం కల్పించడంపై తెలంగాణ మాదిగ విద్యార్థి, రీసెర్చ్ స్కాలర్స్ కోఆర్డినేటర్ వలిగొండ నరసింహ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రమంత్రి వర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించి సీఎం సామాజిక న్యాయాన్ని పాటించారని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌ను మాల మహానాడు నాయకులు సన్మానించినటు తెలిపారు.

మహిళ అదృశ్యం

సనత్‌నగర్: మెట్రో స్టేషన్‌లో సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎర్రగడ్డ బంజారానగర్‌కు చెందిన డి.రాజా సోదరి జ్యోతి భరత్‌నగర్ మెట్రోస్టేషన్‌లో సెక్యూరిటీ ఉద్యోగం చేస్తోంది. రోజులాగే ఈనెల 7న ఉదయం 5 గంటలకు విధులకు వెళ్లిన జ్యోతి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది.దీంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మంత్రివర్గంలో లంబాడీలకు తీవ్ర అన్యాయం'

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, గిరిజన చైతన్య వేదిక ఓయూ జాక్ చైర్మన్ డా.కరాటే రాజునాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ ఎమ్మెల్యే రామచంద్రం నాయక్‌కు డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టి ఎస్టీలకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. మంత్రివర్గం, నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవులు, ఇతర అధికార, పాలన పరమైన పదవుల నియామకాల్లో లంబాడీలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వివక్ష చూపుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 14 శాతం గల ఎస్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం దారుణమని ఎస్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కళాసిల్క్ చేనేత వస్త్ర హస్త కళా ప్రదర్శనకు స్పందన



కొనుగోలు చేస్తున్న ప్రజలు

సికింద్రాబాద్: పద్మారావునగర్‌లోని కొథ కామకోటి కల్యాణ నిలయంలో కళా సిల్క్ వారు ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన వస్తోందని నిర్వాహకుడు వినోద్ తెలిపారు. చేనేత వస్త్రాలు, అన్ని రకాల కాటన్ వస్త్రాలు, అన్ని రాష్ట్రాల్లోని సంప్రదాయ దుస్తులు, హస్తకళ వస్తువులు, దేశంలో అన్ని రకాల శుభకార్యాలకు సంబంధించిన వస్త్రాలు, ఇంటి గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు ఉపాధితో పాటు, వినియోగదారులకు తక్కువ రేటుకే ఉత్పత్తులు దొరుకుతాయన్నారు. పరిసర ప్రాంతవాసులు వినియోగించుకోవాలని సూచించారు.

శ్రీ నృత్యగోపాల్‌దాస్‌ను కలిసిన మణిదీప్



సనత్‌నగర్: అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, మధుర కృష్ణ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ శ్రీ నృత్య గోపాల్ దాస్ 87 వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా యూత్ కన్వీనర్, మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మణిదీప్ ఆదివారం స్వామీజీని అయోధ్యలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణలో మహంత్ నృత్య గోపాల్ దాస్ చేస్తున్న కృషి ఎనలేనిదని ఈ సందర్భంగా మణిదీప్ కొనియాడారు. హిందూజాతి భావ జాలాన్ని అణువణువు నింపుకున్న స్వామీజీ ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. స్వామీజీ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించి ఈ జాతికి దిశా నిర్దేశం చేసేలా ఆయనకు శక్తిసామర్థ్యాలను అందించాలని ఆ భగవంతున్ని వేడుకుంటున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అమీర్‌పేట: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధనలక్ష్మి బ్యాంక్ ఎదురుగా 51 బై త్రీ ఆర్టీలోని భవనంపై నుంచి వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. భవనంపై నుంచి మామిడి పండ్లు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంబంధికులు ఎవరైన ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



చిక్కడపల్లి: భారతప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నేతలు, కార్యకర్తలు ప్రజలకు వివరించి అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ సూచించారు. ఆదివారం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహించిన బీజేపీ డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, నవీన్‌కుమార్, శ్రీకాంత్, వీఎస్టీరాజు, సత్తిరెడ్డి, బాలకృష్ణ, విష్ణుప్రాసద్, శ్రీనివాసయాదవ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నయా లుక్..!

- మారిన మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల రూపురేఖలు
- రూ. 2.40 కోట్ల వ్యయంతో జీ+2తో 10 అదనపు గదుల నిర్మాణం
- వాల్ పేయింటింగ్‌తో ప్రహరీ, ఫ్లోరింగ్



బన్సీలాల్‌పేట్: భోలక్‌పూర్ కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల కొత్త రూపు సంతరించుకున్నది. రూ 2.40 కోట్ల వ్యయంతో జీ+2తో 10 అదనపు తరగతి గదులు, గ్రౌండ్ ఫ్లోర్‌ను నిర్మించారు. అంతేగాకుండా చుట్టు ప్రహరీ, గోడలపై ఆకట్టుకునేలా పెయింటింగ్ వేశారు.

విద్యనభ్యసిస్తున్న 620 మంది విద్యార్థులు

ఈ పాఠశాలలో యూకేజీ నుంచి ఏడో తరగతి వరకు ఉండగా భోలక్‌పూర్, కృష్ణానగర్, బోయిగూడ, బన్సీలాల్‌పేట్, కవాడీగూడ, ఐడీహెచ్ కాలనీ, బండమైసమ్మనగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 620 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక చొరవతో అనేక సౌకర్యాలు, సదుపాయాలు మెరుగుపడ్డాయి. తెలంగాణ గురుకుల పాఠశాలల ఎంపిక కోసం కూడా విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఏటా గురుకుల పాఠశాలలకు కూడా ఎంపిక అవుతున్నారు.

కలెక్టర్ ప్రశంసా..



పాఠశాలలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (ఫైల్)

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మేకలమండి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, తరగతి గదులను పరిశీలించి ముగ్ధుడయ్యారు. స్కూల్ అభివృద్ధికి ఉపాధ్యాయులు, అభివృద్ధి కమిటీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. విద్యార్థుల సంఖ్యను పెంచి 'నో అడ్మిషన్' అనే విధంగా బోర్డు ఏర్పాటు చేసే స్థాయికి పాఠశాలను తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాల సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

అదనపు గదులతో..

నూతనంగా 10 అదనపు గదులతో పాటు పాత భవనంలో 15 అదనపు గదులతో విద్యార్థులకు మేలు జరగనున్నది. అదేవిధంగా బోధనకు అనువుగా ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ప్రభుత్వం,సీఎస్‌ఆర్ సంస్థల చేయూత

ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్‌ఆర్ కార్యక్రమం ద్వారా పాఠశాలలో అనేక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించింది. పుస్తకాలు, షూలు, బ్యాగులు, బీరువాలు ఫర్నీచర్ వంటి అనేక సదుపాయాలు సమకూర్చింది. కవాడీగూడలోని ఎన్‌టీపీసీ సంస్థ మేకలమండి ప్రభుత్వ పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పలు రకాల సహకారంతో ఎంతో తోడ్పాటునందిస్తున్నది.

విద్యతో పాటు క్రీడలు..



విశాలంగా ఉన్న తరగతి గదులు

మేకలమండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. ఓ స్వచ్ఛంధ సంస్థ ముందుకు వచ్చి ప్రత్యేకంగా కోచ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఫుట్‌బాల్ ఆడిస్తున్నారు.

విద్యార్థులను చేర్పించేందుకు ఆసక్తి..



పాఠశాలలో మెరుగైన బోధనతో అనేక సౌకర్యాలు ఉన్నాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల సహకారంతో పాఠశాల దినదినాభివృద్ధి చెందుతున్నది. ఇక్కడి విద్యాబోధన, వసతులను చూసి పేద కుటుంబాల వారు తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు.

– జి. స్వరూప, ప్రధానోపాధ్యాయురాలు